



ఉపాధి పనులు అవినీతి, అక్రమాల వేదికగా మారాయి. ఐదు సంవత్సరాల క్రితం వైసీపీ నాయకుడిగా ఉండి ఆ పార్టీ ప్రభుత్వం వచ్చాక ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ వ్యక్తి రూ.లక్షల నిధులు గోల్‌మాల్ చేశాడు. వైసీపీ కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, వలస కూలీలు.. ఇలా తనకు అనుకూలమైన వారంతా ఉపాధి పనులకు వెళ్లినట్లు మస్టర్లు రాయించుకొని రూ.లక్షల్లో అవినీతికి పాల్పడ్డాడు. తన అన్నతో పాటు అయిన వారంతా వైసీపీ నాయకులు కావడంతో గ్రామస్థులు కూడా ఇంతకాలం నోరు మెదపలేదు. చివరకు వారం రోజుల క్రితం సదరు గ్రామస్థులే ఈ ఉపాధి అక్రమార్కుడి ఆగడాలను వైసీపీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆయన ఎన్నికలయ్యాక చూద్దామనడంతో గ్రామస్థులంతా ముక్కున వేలేసుకొని బయటకు వెళ్లిపోయారు.

- ఆరేకల్లు 'ఉపాధి'లో అక్రమాలు
- పనులు చేయకున్నా డబ్బులు జమ
- అవినీతి గోపాలుడికి వైసీపీ అండదండలు
- ప్రభుత్వ ఉద్యోగుల పేరిట జాబ్ కార్డులు
- వైసీపీ కాంట్రాక్టర్లు, వలస కూలీలకు మళ్లింపు
- రూ.లక్షలు స్వాహా చేసిన ఫీల్డ్ అసిస్టెంట్

నిధులు దోచేశాడు..!



ఆదోని రూరల్, ఫిబ్రవరి 27: ఆదోని మండలం ఆరేకల్లు గ్రామానికి చెందిన గోపాల్ ఐదు సంవత్సరాల క్రితం గ్రామ వైసీపీ నాయకుడు. అతడి అన్న బళ్లారి రాముడు కూడా గ్రామంలో ముఖ్య వైసీపీ నాయకుడు. అంతే కాదు ఆదోని వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు. దీంతో వైసీపీ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టాడు. అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండడంతో సదరు ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి అక్రమాలకు తెర లేపాడు. అంతేగాకుండా సంబంధిత అధికారులను సైతం కంటి సైగలతో శాసించే స్థాయికి వచ్చాడు. అడిగేవాడు, నిలదీసేవాడు లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, వైసీపీ కాంట్రాక్టర్లు, గ్రామం వదిలి వలస బాట పట్టిన కూలీల పేర్ల మీద జాబ్ కార్డులు రాయించాడు. పనికి వెళ్లకపోయినా మస్టర్లు రాయించి వారి ఖాతాల్లో ఉపాధి డబ్బులు జమ చేయించాడు. తమ ఖాతాల్లో నిధులు జమ అయిన వారిలో కొత మంది ఫోన్‌పే ద్వారా.. మరికొందరు వెళ్లి వేలిముద్ర వేసి ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా సదరు ఫీల్డ్ అసిస్టెంట్ భార్య పేరు మీద కూడా డబ్బులు మళ్లించుకున్నాడు. వాస్తవానికి ఆమె ఇంటి వద్ద కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. ఏ రోజు కూడా ఉపాధి పనులకు వెళ్లలేదు. ఉషారాణి జాబ్ కార్డు నెం. ఏపీ-13-023-020-023/10703 జాబ్ కార్డు కింద 2021-22లో వంద రోజులు పని చేసినట్లు రూ.21,834, 2022-23లో 100 రోజులు పనిచేసినట్లు రూ.22,568.23, 2023-24లో 100 రోజులు పని చేసినట్లు రూ.26,941.54 నిధులు జమ అయ్యాయి. అలాగే ఆదోని మండలం అరేకల్లుకు చెందిన జెల్లి ఝాన్సీ గత ఏడాది జనవరి 27వ తేదిన ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం పెద్దగోగులపల్లె గ్రామానికి చెందిన వెంకట రమణ అలియాస్ వెంకటేశులును వివాహం చేసుకుని వెళ్లారు. అయితే ఈమె జాబ్ కార్డు నెం ఏపీ -13-023- 020-023/010739 గల జాబ్‌కార్డుపై 2023-24 సంవత్సరంలో ఈమె ఖాతాలోకి రూ.26,951.45 జమ అయ్యాయి. వైసీపీ కాంట్రాక్టర్ రామిరెడ్డి కోటీశ్వరుడు. ఇతను ఉపాధి పనులకు వెళ్లినట్లు జాబ్‌కార్డు నెం. ఏపీ -13-023-020-023/010577 కింద 2020-21లో 33 రోజులకు రూ.6,877, 2021-22లో 27 రోజులకు రూ.5,507 నిధులు జమ అయ్యాయి. అలాగే మేకల వీరేష్ అనే యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రెండేళ్లుగా అక్కడే ఉంటున్నాడు. జాబ్ కార్డు నెం. ఏపీ - 13-023-020-023/10921 ఇతను కూడా ఉపాధి పనులకు వెళ్లినట్లు 2023-24లో 2,445.25 నిధులు జమ అయ్యాయి. బోయ పుల్లయ్య హైదరాబాదుకు వలస వెళ్లాడు. జాబ్ కార్డు నెం. ఏపీ-13-023-020-023/10878 వీరి ఖాతాలో 2023-24లో 88 రోజులకు పనులకు వెళ్లినట్లు రూ.23,841 జమ చేశారు. మంగలి తిరుమలేష్ బెంగళూరులో బార్బర్ దుకాణంలో పని చేసుకుంటూ అక్కడే స్థిరపడ్డాడు. ఏపీ 13-023-020-023/010722 జాబ్ కార్డు కింద 2022-23లో 98 రోజులకు రూ.22,604.93, 2023-24లో 97 రోజుల పనులకు వెళ్లినట్లు రూ.26,226.73 నిధులు జమ చేశారు. గ్రామంలో 633 జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో దాదాపు 200 జాబ్‌కార్డులకు పైగానే అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు గవిగట్టు వీరారెడ్డి... రెండు సంవత్సరాల క్రితం అరేకల్లులోని పెద్ద పెండేకల్లు రహదారిలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇతని పేరుపై జాబ్ కార్డు నెం. ఏపీ-13-023-020-023/10908 ఉంది. ఇతను ఉపాధి పనులకు వెళ్లినట్లు 2023 నవంబరులో రూ.1,747.42, డిసెంబరులో రూ.5,817.29, 2024 జనవరిలో రూ.5,642.07 ఇలా మొత్తం రూ.13,206.78 నిధులు జమ అయ్యాయి. అయితే ఇదే విషయంపై గవిగట్టు వీరారెడ్డి, స్పందిస్తూ తనకు జాబ్ కార్డు ఉందో లేదో కూడా తెలియదని, డబ్బులు జమ అవుతున్న విషయం కూడా తెలియదని పేర్కొనడం కొసమెరుపు.

ఆర్టీసీ డ్రైవర్ ఖాతాలో ఉపాధి నిధులు



ఆదోని మండలం అరేకల్లు గ్రామానికి చెందిన కె.రాజు వృత్తిరీత్యా ప్రభుత్వ ఆర్టీసీ కాంట్రాక్టు డ్రైవర్. ఇతడి భార్య సరస్వతి గృహిణి. రాజు వృత్తిరీత్యా డ్రైవింగ్ పనులకు నిత్యం వెళ్తుంటారు. అయితే వీరిపై జాబ్ కార్డు నెం.ఏపీ-13-023-020-023/010621పై పనులకు వెళ్లినట్లు రికార్డులో ఉంది. వీరి ఖాతాల్లో 2022-23లో రూ.22,663.3, 2023-24లో రూ.26,862.1 నిధులు జమ అయ్యాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఉద్యోగులు జాబ్ కార్డు ద్వారా ఉపాధి పనులు చేయడానికి వీల్లేదు. ఆరేకల్లు ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం.

-ఇన్‌చార్జి ఏపీవో ఖాలిక్ అబ్దుల్, ఆదోని



దివ్యాంగుడి పేరు మీద కూడా..



ఆదోని మండలం అరేకల్లుకు చెందిన గవిగట్టు భాస్కర్ కొన్ని సంవత్సరాల క్రితం ట్రాక్టర్ ప్రమాదానికి గురయ్యాడు. కాలు కింది భాగం పూర్తిగా తొలగించారు. కృత్రిమ కాలుతో ఆదోనిలో స్కూటర్ మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్నాడు. జాబ్ కార్డు నెం. ఏపీ 13- 023-020-023/010278పై ఉపాధి పనులకు వెళ్లినట్లు రికార్డులు చూపుతున్నాయి. 2022-23 ఏడాదిలో 86 రోజలు పనులకు వెళ్లినట్లు రూ.20,763.31, 2023-24లో 96 రోజులు పనులకు వెళ్లినట్లు రూ.25,807.72 అతని ఖాతాలో జమ అయ్యాయి. ఇదే విషయంపై గవిగట్టు భాస్కర్ స్పందిస్తూ కాలు విరిగినప్పటి నుంచి స్కూటర్ మెకానిక్ షాపు నడుపుకుంటున్నానని, ఉపాధి పనులకు వెళ్లలేదని అన్నాడు. ఓసారి ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఫోన్ చేయండని, లేదంటే తన వెంట వస్తే అతని వద్దకు వెళ్లి మాట్లాడదామని అన్నాడు.

వెల్లుల్లి కిలో రూ.500

సామాన్యుల బెంబేలు



కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: వంటింట్లో అందరూ వాడే వెల్లుల్లి ధర విపరీతంగా పెరిగిపోతోంది. ఔషధాల తయారీలో కూడా వాడే వెల్లుల్లి సాగు ఈ సంవత్సరం వర్షాభావం వల్ల భారీగా పడిపోయింది. ప్రస్తుతం దీని ధర గతంతో పోలిస్తే వందశాతం పెరిగింది. రిటైల్‌గా కిలో రూ.500 పలుకుతోంది. ఇంత భారీగా పెరిగిన వెల్లుల్లి ఏం కొంటాం అని సామాన్య ప్రజలు అంటున్నారు.

● **సరఫరా తగ్గడంతో:...**

వెల్లులి దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లోకి సరఫరా కూడా పడిపోయింది. దీంతో ఇటీవల కొన్ని రోజుల్లోనే ధర అమాంతం పెరిగిపోయింది. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.350 నుంచి రూ.500కు చేరుకుంది. కర్నూలు నగరంలోని పాతబస్టాండులో హోల్‌సేల్ మార్కెట్‌లోనే రూ.350 నుంచి రూ.400 పలుకుతోంది. నాణ్యమైన వెల్లుల్లి రూ.500 దాటిపోయింది. ఉత్తరాదిన అనూహ్య వర్షాల వల్ల, దక్షిణాదిన వర్షాభావం వల్ల వెల్లుల్లి దిగుబడి దెబ్బ తిందని వారు స్పష్టం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో మిచౌంగ్ తుఫాన్ కూడా వెల్లుల్లి పంటను నష్టపరిచింది. దీని వల్ల మార్కెట్‌లోకి వెల్లుల్లి సప్లయ్ తగ్గి ధరలు అమాంతం ఆకాశానికి ఎగబాకుతున్నాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం చలికాలంలో వెల్లుల్లి ధరలు పెరుగుతాయి. కొత్త పంట మార్కెట్‌లోకి వచ్చేవరకు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెల్లుల్లి ఎగుమతిపై నిషేధం విధించింది. దేశంలోనే అతి పెద్ద వెల్లుల్లి మార్కెట్‌లలో ఒకటైన గుజరాత్‌లోని జామ్ నగర్, మండిలో సోమవారం కిలో వెల్లుల్లి టోకు ధర రూ.300-350కు చేరుకుందని స్థానిక వ్యాపారులు తెలిపారు. భారతదేశంలో గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వెల్లుల్లి ఎక్కువగా సాగవుతోంది.





ఓటరు దరఖాస్తులను పరిష్కరించండి

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 27: పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫాం-7కు సంబంధించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుంచి అనుమతి వచ్చిన వెంటనే వాటిని తొలగించాలని ఆర్వోలను ఆదేశించారు. 0.1 శాతంలోపు ఉన్న వాటిని తొలగించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు శేషిరెడ్డి, రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

విరూపాక్షితో వేగలేం... వైసీపీలో ఉండలేం..

- దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడి రాజీనామా
- ఆలూరు వైసీపీకి రోజుకో షాక్

ఆలూరు/ దేవనకొండ, ఫిబ్రవరి 27: ఆలూరు నియోజకవర్గంలో వైసీపీకి రోజుకో షాక్ తగులుతోంది. ఆ పార్టీని రోజుకొకరు వదిలేసిపోతున్నారు. వైసీపీకి రాజీనామా చేస్తున్న ప్రతి ఒక్కరూ నియోజకవర్గ సమన్వయ కర్త విరూపాక్షిపై విమర్శలు గుప్పిస్తున్నారు. 'ఈ విరూపాక్షితో వేగలేం.. అందుకే పార్టీని వదిలేస్తున్నాం..' అని పార్టీని వీడుతున్నారు. రెండు రోజుల క్రితం మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ వైసీపీకి గుడ్‌బై చెప్పారు.



వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున తదితరులు

ఆయనతో పాటు మాజీ మండల కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, తదితరులు వైసీపీని వీడారు. తాజాగా మంగళవారం దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ (కిట్టు) మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జునతో పాటు వారి అనుచరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆలూరు ఇన్‌చార్జిగా విరుపాక్షి నియమితులైనప్పటి నుంచి పార్టీలో వర్గ విభేదాలు పెరిగాయన్నారు. తమను అన్ని విధాలుగా చులకనగా చూస్తూ పార్టీకి దూరం పెట్టాడని ఆరోపించారు. వైసీపీ కోసం అహర్నిశలు కష్టపడిన తమను గుర్తించకుండా ఎవరికో ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. వైసీపీలో ఏకపక్షధోరణి, పక్షపాతవైఖరి కొనసాగుతోందన్నారు. అందుకే పార్టీని వీడుతున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.



స్నేహితుడిని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్తున్న దృశ్యం

ప్రశాంతంగా టెట్

- ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష
- తొలిరోజు 620 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27: కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈ పరీక్ష మార్చి 6వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటి రోజు కావడంతో అభ్యర్థుల్లో కంగారు, ఆందోళన కనిపించింది. పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంలో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష కేంద్రాల రోడ్డు మార్గాల్లో స్పెషల్ ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేయకపోవడంతో అభ్యర్థులు ఆటోలపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం 7:30 గంటలకే అభ్యర్థులు తమ బంధువులు, తల్లిదండ్రులతో రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా కనిపించింది. పరీక్ష కేంద్రాల ప్రాంగణాల వద్ద హాల్ టికెట్ నెంబర్ల కేటాయింపు నోటీసు బోర్డు ఒకే చోటనే ఏర్పాటు చేయడంతో తమ హాల్‌టికెట్ నెంబర్లను చూసుకునేందుకు అభ్యర్థుల మధ్య తోపులాట జరిగింది. దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8:20 గంటలకే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 9 గంటల తర్వాత 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను కూడా మానవతాదృక్పథంతో కేంద్రాల్లోకి అనుమతించారు. జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కలాశాల, దూపాడు అయాన్ డిజిటల్ సెంటర్, పెద్దటేకూరు బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలోనూ, ఆదోని భీమా ఇంజనీరింగ్ కళాశాల, ఎమ్మిగనూరు. సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో పాటు, హైదరాబాదులోని కమాన్‌గూడ అయాన్ డిజిటల్ సెంటర్‌లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. టీసీఎస్ ఆధ్వర్యంలో టెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉదయం సెషన్, మధ్యాహ్నం 2:30 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష జరిగింది. జిల్లాలో పరీక్షకు మొత్తం 26,421 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మొదటి రోజు మంగళవారం 3,570 మందికి కేటాయించగా.. 29,051 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 620 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ శ్యామ్యూల్, ఏడీ-1 శామ్యూల్ పాల్‌తో పాటు ప్రతి సెంటరుకు డిపార్టుమెంటల్ ఆఫీసర్ పరీక్ష కేంద్రం పరిశీలకులు తనిఖీలు చేశారు.



జి.పుల్లయ్య కళాశాల ఆవరణంలో టెట్ అభ్యర్థులు ←

నాణ్యంగా అభివృద్ధి పనులు

● వర్క్‌షాపులో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 27: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యంగా చేపట్టాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల సర్పంచులు, 422 మంది పంచాయతీ కార్యదర్శుల కు(గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు) మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో వర్క్‌షాపు ప్రారంభించారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్, విజయవాడ ఆధ్వర్యంలో మార్చి 1 వరకు జరిగే ఈ వర్క్‌షాపులో గ్రామ పంచాయతీల్లో వస్తువుల కొనుగోలు, వ్యాలిడిటీ తదితర ముఖ్యమైన అంశాలపై అవగాహన తరగతులు ఉంటాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిర్మాణాలు, కార్యాలయాల్లో, ఇళ్లలో వినియోగించే సిమెంట్, మెడికల్, వ్యవసాయం, ఎలక్ట్రికల్ కేబుల్స్, పీవీసీ పైపులు, గ్యాస్ స్టవ్స్ తదితర పరికరాలు కొనుగోలు చేసే సమయంలో ఐఎస్ఐ మార్కు ఉన్నదా లేదా అని పరిశీలించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో ప్రతి వస్తువు కొనుగోలు చేసే విధంగా సర్పంచులు, కార్యదర్శులకు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, డీఎల్‌పీఓలు తిమ్మక్క, నూర్జహాన్, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, జూనియర్ అసిస్టెంట్ రాజావిష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జీవితాలతో వైసీపీ ఆటలు : ఎన్ఎస్ఎఫ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 27: సీఎం జగన్ మోహన్ రెడ్డి హయాంలోని వైసీపీ నాయకులు క్రీడాకారుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి పోగు బజారన్న ఆరోపించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర రంజీ జట్టులో 17వ ఆటగాడిగా ఉన్న తిరుపతి వైసీపీ కార్పొరేటర్ కుమారుడి కోసం ప్రస్తుత కెప్టెన్ హనుమ విహారిని వేధించడం సిగ్గుచేటన్నారు. అత్యుత్తమ క్రీడాకారుడిగా పేరొందిన హనుమ విహారి వైసీపీ రాజకీయాలకు బలయ్యాడన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నిందితుడు శరత్‌చంద్రారెడ్డిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించినప్పుడే ఏసీఏ పరువు బంగాళాఖాతంలో కలిసిపోయిందన్నారు. వైసీపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా హనుమవిహారికి క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని కేటాయించాలన్నారు.

జువెనైల్ హోం తనిఖీ

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 27: స్థానిక బీక్యాంపులోని జువెనైల్ హోమ్‌ను, మద్దూరు నగర్‌లోని వృద్ధాశ్రమంతో పాటు దిశ వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి అక్కడుంటున్న మహిళలు, బాలలకు వారి హక్కులు, బాధ్యతలతో పాటు వివిధ చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

శాశ్వత లోక్ అదాలత్ పై శిబిరం: ప్రజా దుర్వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ కృషి చేస్తుందని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ తెలియజేశారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కోర్టు ఖర్చులు లేకుండా ఉచితంగా న్యాయాన్ని అందించడానికి శాశ్వత లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తత

రక్త నమూనాలు సేకరిస్తున్నామన్న పశుసంవర్ధకశాఖ జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: నెల్లూరు జిల్లాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోళ్ల ఫారాల్లో కోళ్లకు రక్తనమూనాల సేకరణ ప్రారంభించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. బర్డ్ ఫ్లూ వైరస్ ప్రమాదకరమైందని, కోళ్లు, బాతులు, ఇతర పక్షుల రక్తనమూనాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి దాకా 40 రక్తనమూనాలు సేకరించడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 30 శాంపుల్స్ సేకరించామన్నారు. మిడ్తూరు మండలంలోని రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలోని పక్షుల నుంచి 24 శాంపుల్స్ తీసినట్లు తెలిపారు. నంద్యాలలో బాతుల నుంచి, ఆలూరు, కర్నూలు రూరల్ మండలాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్ల నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు జేడీ రామచంద్రయ్య తెలిపారు. ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్ల వద్దకు వలసపక్షులు వచ్చేందుకు అవకాశం ఉందని అన్నారు. వెలుగోడు, సుంకేసుల, గార్గేయపురం తదితర రిజర్వాయర్ల సమీపంలోని కోళ్ల ఫారాల్లో కోళ్లకు రక్తనమూనాలు సేకరించామని అన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా సోకినట్లు తమ దృష్టికి రాలేదని జేడీ రామచంద్రయ్య తెలిపారు.

ఆరుగురికి హెడ్ నర్సులుగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 27: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరుగురు స్టాఫ్ నర్సులు హెడ్ నర్సులుగా పదోన్నతి పొందారు. గత శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ కడప రీజనల్ కార్యాలయంలో ఆర్‌డీ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో కర్నూలు జీజీహెచ్ నుంచి జి. విజయమ్మ, బి. ఎల్లమ్మ, కె. సిద్ధమ్మ, టి. నాగమణి, అనంతపురం నుంచి జి. విజయలక్ష్మి, సుశీలమ్మ ఉన్నారు. జి. విజయమ్మ, బి. ఎల్లమ్మ, జి. విజయలక్ష్మి కర్నూలు జీజీహెచ్‌కు, కె. సిద్దమ్మ, సుశీలమ్మ, టి. నాగమణి స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు పదోన్నతులతో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఐ. వెంకటతులసమ్మ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రీబాయి నాగమణి, అనసూయ, రాజ్యలక్ష్మి అభినందనలు తెలిపారు.

ఆదోని మార్కెట్లో ఎండు మిర్చి విక్రయాలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఇకనుంచి వారంలో మూడు రోజులపాటు ఎండుమిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎండుమిర్చిని రైతులు విస్తారంగా సాగు చేశారన్నారు. పశ్చిమ ప్రాంత నియోజకవర్గంలో రైతుల విజ్ఞప్తి మేరకు ఆదోని మార్కెట్లో మూడు నెలలు కిందట ఎండుమిర్చి కొనుగోళ్ళను ప్రారంభించామన్నారు. గుంటూరు, బ్యాడిగి, కర్నూలు, ఎమ్మిగనూరు, స్థానికంగా వ్యాపారులు కలిసి టెండర్ విధానం ద్వారా మిర్చిని కొనుగోలు చేస్తున్నారన్నారు. రెండు రోజులే క్రయవిక్రయాలు ఉండేవని, రైతుల విజ్ఞప్తి మేరకు సోమవారం, బుధవారం, శుక్రవారం వారాల్లో వారంలో మూడు రోజులపాటు ఎండుమిర్చి కొనుగోలు జరుగుతాయని తెలిపారు. రైతులు ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసుకొని తీసుకొస్తే మంచి ధర లభిస్తుందన్నారు. ఇతర మార్కెట్ కమిటీలకు వ్యయ ప్రయాసలు ఒర్చి వెళ్లి నష్టపోకుండా స్థానిక మార్కెట్ యార్డ్‌లోనే విక్రయించుకోవాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

రోడ్ సేఫ్టీ కమిటీలో డీఆర్వో ఆదేశం

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: రహదారుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని డీఆర్వో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రహదారుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పలూర్తి చేయడంతో పాటు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను డీఆర్వో ఆదేశించారు. ఎన్‌హెచ్-40 రహదారిలోని అండర్‌పాస్, జగనన్న హౌసింగ్ కాలనీకి సర్వీస్ రోడ్డు గురించి ఎన్‌హెచ్-40 అధికారులతో చర్చించారు. ఎన్‌హెచ్, రవాణా అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేసి అండర్ పాస్ కల్పించడం కుదరదని అందుకు ప్రత్యామ్నాయ మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర ట్రాఫిక్ నియంత్రణ కోసం అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, పంచాయితీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఆర్టీఓ రమేష్, డిప్యూటీ డెమో భాస్కర్, ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

గాజులదిన్నెలో 0.8 టీఎంసీలు

- ఎల్లెల్సీ నుంచి పన్నెండు రోజుల పాటు మళ్లింపు
- రోజుకు 239 క్యూసెక్కులు
- కర్నూలుకు రోజుకు 40 క్యూసెక్కులు విడుదల
- ఈ వేసవిలో తాగునీటి పథకాలకు కష్టమే
- ముందుస్తు వర్షాలపై అధికారుల ఆశలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 27: గాజులదిన్నె ప్రాజెక్టు కింది తాగునీటి పథకాలకు ఈ ఏడాది నీటి గండం రానుంది. ప్రస్తుతం జీడీపీలో 0.8టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మంగళవారం నుంచి గోనెగండ్ల ఎల్లెల్సీ ఎస్కేప్ చానల్ నుంచి రోజుకు 239 క్యూసెక్కుల నీరు అధికారులు జీడీపీకి మళ్లిస్తున్నారు. మంగళవారం నుంచి ఎల్లెల్సీ ఎస్కేప్ చానల్ ద్వారా పన్నెండు రోజుల పాటు రోజుకు 239 క్యూసెక్కుల నీరు జీడీపీకి మళ్లిస్తున్నారు. ఎల్లెల్సీ నీరులేకపోతే వేసవిలో ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉండేది. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలు నీరు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడి డోన్, పత్తికొండ, కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాలకు తాగునీటి సమస్య తీవ్రమయ్యేది. అయితే ప్రస్తుతం నిలువ ఉన్ననీరు ఏప్రిల్, మే నెల వరకు తాగునీటి పథకాలకు సరిపోతాయని జూన్, జూలై నెలలో నీటి ఎద్దడి వచ్చే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కట్ట ఎత్తుపనులు జరుగుతుండటం దీనికి తోడు ఆరు క్రస్ గేట్లను మరమత్తు చేస్తుండటంతో ప్రాజెక్టులోని నీరు అంతా గత నాలుగు మాసాల క్రితమే కిందకు వదిలేశారు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టుకు వరద నీరు చేరలేదు. దీంతో ఈ వేసవిలో ప్రాజెక్టు కింద ఉన్న బండగట్టు(40 గ్రామాలకు తాగునీటి పథకం), డోన్, క్రిష్టగిరి తాగునీటి పథకాలకు నీరు విడుదల చేయాల్సి ఉంది. కర్నూలు నగరంలో తాగునీటి సమస్య రావడంతో మంగళవారం నుంచి కర్నూలు నగరానికి రోజుకు 40 క్యూసెక్కుల ప్రకారం జీడీపీ నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. అవసర సమయంలో కోడుమూరు, గూడురు, బెళగల్ తదితర ప్రాంతాలకు తాగునీటి విడుదల చేసేందుకు ఇబ్బందిగా మారుతుందన్న సమస్య గమనించిన ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఎల్లెల్సీ నీటిని ప్రాజెక్టులోకి మళ్లిసున్నారు. ఎల్లెల్సీ నీరు నిలువ చేసినప్పటికీ మే నెల చివరి వరకు సరిపోతాయా లేదా అనే అనుమానం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జీడీపీలో 0.8 టీఎంసీల నీరు నిలువ వుంది. వేసవి తాపం వల్ల నిలువ వున్న నీటిలో సగం వరకు అవిరి రూపంలో ఖర్చవుతాయి. కాబట్టి ఇబ్బందులు తప్పవని అధికారులు అంటున్నారు. ఈ వేసవి గండం ఎలా తప్పుతుందా అని ఇరిగేషన్ అధికారులు ఆలోచిస్తున్నారు. ముందస్తు వర్షాలు వస్తే తాగునీటి పథకాలకు నీటి సమస్య రాకపోవచ్చునని అధికారులు అంటున్నారు.



గాజులదిన్నె ప్రాజెక్టులో నిలువ ఉన్న నీరు

239 క్యూసెక్కుల నీరు జీడీపీకి మళ్లింపు

గోనెగండ్ల సెక్షన్‌కు మంగళవారం నుంచి విడుదలైన 239 క్యూసెక్కుల నీటిని ఎస్కేప్ చానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టు మళ్లిస్తున్నాము. మరో 12 రోజులపాటు నీరు విడుదల చేస్తారు. మిగిలిన రోజుల్లో విడుదల అయ్యే నీరు కేవలం తాగునీట పథకాలకు మాత్రమే. గోనెగండ్లలోని రెండు ఎస్ఎస్ ట్యాంకులు, కుంటలు, వాగులకు మాత్రమే ఈ నీటిని విడుదల చేస్తాం.

- ఉదయ్‌భాస్కర్ ఏఈ ఎల్లెల్సీ గోనెగండ్ల

ఇదేమి కక్ష?

- కుటుంబ తగాదాలతో నకిలీ హాల్‌టికెట్ తయారీ
- గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు చిత్తూరు కేంద్రంగా..
- తీరా నకిలీ హాల్‌టికెట్ అని తెలిసి ఫిర్యాదు
- అసలు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



మీడియా సమావేశంలో నిందితుడిని చూపిస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

చిత్తూరు/డోన్, ఫిబ్రవరి 27: వారిద్దరూ బంధువులే. కానీ, రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలున్నాయి. దీంతో గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్షకు నకిలీ హాల్ టికెట్‌ను సృష్టించి ఇచ్చి.. పోలీసులకు పట్టించాలని పథకం పన్నాడు. తీరా అతడే నిందితుడిగా దొరికిపోయాడు. కర్నూలు జిల్లాలో మొదలైన ఈ కుట్ర.. చిత్తూరులో బయటపడింది. ఈ వివరాలను మంగళవారం చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి ఏఎస్పీ అరీఫుల్లా మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని రాజా కాంప్లెక్స్‌లోని మీ సేవా కేంద్రంలో పనిచేస్తున్న బంధువైన ఇమ్మానుయేలును.. అదే జిల్లా క్రిష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన సుదర్శనం కోరారు. గతంలో తమ రెండు కుటుంబాల మధ్య ఉన్న వైషమ్యాలను మనసులో పెట్టుకుని ఇమ్మానుయేలు దరఖాస్తు చేయకుండా మోసం చేయాలని నిర్ణయించుకున్నాడు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. ఆ మేరకు హాల్‌టికెట్ తీసివ్వాలని సుదర్శనం అడిగారు. అదే మీ సేవా కేంద్రంలో మండ్ల శ్రీనివాసులు అనే అభ్యర్థి ఒరిజనల్ హాల్ టికెట్ పీడీఎఫ్‌లో సేవ్ అయి ఉంది. ఆ ఒరిజనల్ హాల్ టికెట్‌ను పీడీఎఫ్ కన్వర్షన్ అప్లికేషన్ ద్వారా ఎంఎస్ వర్డ్ అప్లికేషన్‌లోకి మార్చి.. సుదర్శనం వ్యక్తిగత వివరాలు, ఫొటోను మండ్ల శ్రీనివాసులు హాల్ టికెట్‌లో ఎడిట్ చేసి నకిలీ హాల్ టికెట్‌ను ఇమ్మానుయేలు తయారు చేసిచ్చాడు. పరీక్షా కేంద్రాన్ని దూరంగా పెడితే వెళ్లడానికి సమయం చాలక.. పరీక్ష రాయకుండా వచ్చేస్తాడని అనుకున్నాడు. అందుకని చిత్తూరు నగరం మర్రిమాను వీధిలోని నారాయణ కాలేజీని పరీక్షా కేంద్రంగా నకిలీ హాల్‌టికెట్‌లో చూపించాడు. ఒకవేళ సకాలంలో పరీక్షకు వెళితే నకిలీ హాల్ టికెట్ కావడంతో పోలీసులకు పట్టుబడతాడని, అప్పుడు తన పంతం నెరవేరుతుందని ఇమ్మానుయేలు భావించాడు. ఈనెల 25వ తేదీన జరిగిన గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షకోసం ఆ హాల్ టికెట్‌తో సుదర్శనం చిత్తూరుకు సకాలంలో చేరుకున్నారు. ఆ హాల్ టికెట్‌లో చూపిన నారాయణ కాలేజీని ప్రభుత్వం పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయలేదు. దీంతో సుదర్శనం చిత్తూరులోని అధికారులను కలిసి హాల్ టికెట్‌ను చూపించారు. ఇది నకిలీదని అధికారులు గుర్తించారు. దీనిపై సుదర్శనం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కర్నూలు జిల్లా డోన్‌లో ఉన్న ఇమ్మానుయేలును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారించారు. నేరం రుజువు కావడంతో మంగళవారం ఇమ్మానుయేలు(24)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అధికంగా కమీషన్ వసూలు చేస్తే చర్యలు

- కడప రీజియన్ పరిధిలో 78 శాతం సెస్సు వసూలు
- ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌ను తనిఖీ చేసిన ఆర్‌డీడీఎం



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీడీఎం శ్రీకాంతరెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 27: పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు మార్కెట్ యార్డుకు వచ్చిన రైతుల నుంచి రెండు శాతం కన్నా అధికంగా కమీషన్ వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ కడప రీజియన్ డిప్యూటి డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. మార్కెట్ కమిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై 'మార్కెట్ కమిటీ అవినీతి మయం.' శీర్షికన ఈనెల 23న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఇందుకు స్పందించిన ఆర్‌డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం మార్కెట్ కమిటిని తనిఖీ చేశారు. స్థానిక కార్యదర్శి పద్మావతి, సిబ్బందితో కలిసి మార్కెట్‌ను, పండ్లు కూరగాయల మార్కెట్‌ను, క్యాంటిన్‌ను, రైతు విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. అనంతరం కార్యాలయలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సిబ్బంది కూడా టెండరు పూర్తయిన వెంటనే వసూలు చేయాల్సిన కమీషన్‌ను మైకుద్వారా ప్రకటించాలన్నారు. బినామీ పేర్లపై చెలామణి అవుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కడప రీజియన్ పరిధిలో రూ.95 కోట్లు సెస్సు వసూలు

మార్కెటింగ్ శాఖ కడప రీజన్ పరిదిలో వ్యవసాయ మార్కెట్ల ద్వారా రూ. 122 కోట్లు సెస్సు వసూలు లక్ష్యంగా పెట్టుకున్న ఆర్‌డీడీఎం శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జనవరి 31 నాటికి రూ.95 కోట్లు వసూలు చేశామన్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటి టార్గెట్ రూ.4.50కోట్లు కాగా ఇప్పటివరకు రూ.5.25కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు.

వైసీపీ కక్ష సాధింపు చర్యలు

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్!

పాత కేసులు తిరగతోడారు



కర్నూలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల దగ్గర పడుతున్న కొద్ది అధికార వైసీపీ నాయకులు రాజకీయ కుట్రలకు తెర తీస్తున్నారు. టీడీపీ ద్వితీయశ్రేణీ, కీలక నాయకులను భయపెట్టి తమ వైపు తిప్పుకోడం.. కాదుకూడదంటే అక్రమ కేసులు పెట్టి బయటకు రాకుండా చేయడం వంటి ఎత్తులకు వేస్తున్నారు. అందులో భాగంగానే నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్‌పై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే దీనిని పోలీసులు బయటకు రానివ్వకుండా తొక్కి పెట్టి.. ఎన్నికల ముందు మల్లెల రాజశేఖర్‌ను కట్టడి చేసేందుకే రౌడీషీట్ తెరిచారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం హుశేనాపురం గ్రామానికి చెందిన ఈడిగ(గౌడ) సామాజికవర్గానికి చెందిన మల్లెల రాజశేఖర్ మొదటి నుంచి టీడీపీ పాణ్యం నియోజవర్గం ఇన్‌చార్జి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతుల ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. టీడీపీలో కీలకంగా రాణిస్తున్న మల్లెల రాజశేఖర్‌ను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా చేశారు. ఆ రోజు నుంచి పార్టీ బలోపేతం కోసం చురుగ్గా పని చేస్తున్నారు. ముఖ్యంగా పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామాల్లో కలియతిరుగుతూ బీసీ సామాజికవర్గంలో పార్టీ బలోపేతం చేయడం, వైసీపీ ముఖ్య నాయకులను టీడీపీలో చేర్పించుకోవడంతో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. ఇది వైసీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం మింగుడు పడడం లేదు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత వర్గాన్ని బలహీన పరచాలనే కుట్రలో భాగంగానే రౌడీషీట్ ఓపెన్ చేశారని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఐదేళ్లగా లేని కేసులు ఇప్పుడే కనిపించాయా..?

2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ అతిత్వరలో రానుంది. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు చీఫ్ ఎన్నికల ఏజెంట్‌గా నియోజకవర్గంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. దీంతో ఆయనను కట్టడి చేయాలనే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకే రౌడీషీట్ ఓపెన్ చేసి గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.

గత ఐగేళ్లగా పోలీసులకు కనిపించని కేసులు సరిగ్గా ఎన్నికలకు నెలరోజుల ముందు కనిపించడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ముఖ్య నాయకుల నుంచి ఆదేశాలు రాగానే పాత క్రైమ్ రికార్డులను పోలీసులు జల్లెడపట్టారు. మల్లెల రాజశేఖర్‌పై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబరు.171/2013 యూ/ఎస్ 323, 506 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, సెక్షన్ 3(1)(ఎక్స్) ఏటపీ యాక్ట్, క్రైం నంబరు.217/2013 యూ/ఎస్ 107, సీఆర్.పీ.సీ, క్రైం నంబరు.53/2014 యూ/ఎస్ 110(ఈ) అండ్ (జీ) సీఆర్‌పీసీ, క్రైం నంబరు.69/2019 యూ/ఎస్ 294, 353,427 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, క్రైం నంబరు.118/2019 యూ/ఎస్ 323, 506 ఆర్/డద్ల్యూ 34 ఏపీసీ అండ్ సెక్షన్ 3 (1)(ఆర్), క్రైం నంబరు.59/2021 యూ/ఎస్ 110 (ఈ) అండ్ (జీ) సీఆర్.పీ.సీ, క్రైం నంబరు.267/2021 యూ/ఎస్ 160 ఐపీసీ, క్రైం నంబరు.90/2022 యూ/ఎస్ 341, 285,290 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ కింద 8 కేసులు ఉన్నట్లు లెక్క తేల్చారు. మూడు అంతకంటే ఎక్కువ కేసులు కలిగి ఉన్నాయనే సాకు చూపి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నంబరు-460 ఓపెన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. రాబోయే ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనకుండా రాజకీయంగా కట్టడి చేసేందుకే వైసీపీ నాయకుల ఒత్తిడితో రౌడీషీట్ ఓపెన్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా తన దృష్టికి రాలేదని పేర్కొనడం కొసమెరుపు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ వివరణ కోరగా తనపై ఓర్వకల్లు పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారనే సమాచారం వచ్చిందని, పూర్తి వివరాలు తెలుసుకొని న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు.

ముగిసిన ఎస్ఎల్, సిటీ స్కాన్ గడువు

● 1 నుంచి న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్‌లో సిటీ సేవలు



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 27: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్‌కు ఈ నెలాఖరుకు గడువు ముగియనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు జీజీహెచ్ ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్ డయోగ్నోస్టిక్ సెంటర్ సిటీ స్కాన్‌కు సంబంధించిన గడువు అయిపోవడంతో మార్చి 1 నుంచి న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్‌లో ఉన్న కొత్త సిటీ స్కాన్‌కు కేసులను పంపించాలని సూపరింటెండెంట్ హెచ్ఓడీలను ఆదేశించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 29 నాటికి ఎస్ఎల్ డయోగ్నస్టిక్‌కు గడువు ముగిసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఈహెచ్ఎస్ ఓపీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈహెచ్ఎస్ ఓపీల్లో ఖచ్చితంగా సంబంధిత విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన న్యూరాలజీ స్ట్రోక్ యూనిట్ (ఐసీయు)లో మెడికల్ పీజీలను నియమించాలని హెచ్‌వోడీని ఆదేశించారు. డెత్ రిపోర్టులు ఆలస్యమవుతున్నాయని, త్వరగా పంపించాలని, డెత్ సమ్మరిలో అన్ని క్షుణ్ణంగా పరిశీలించాకే హెచ్‌వోడీలు సంతకం చేయాలని అన్నారు. ఈ సమీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సి. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకు సీఈవోగా విజయ్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా విజయకుమార్‌ను నియమిస్తూ ఆప్కాబ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం విజయకుమార్ విలేకరులతో మాట్లాడుతూ రైతులకు బ్యాంకు ద్వారా రుణాలను సకాలంలో అందించి ఆదుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఈవోగా బాధ్యతలు చేపట్టిన విజయకుమార్‌ను బీఎం రామాంజనేయులు, ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వహించిన శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, త్రినాథ్‌రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 27: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్టిచ్చింగ్ చార్జీలు, యూని ఫామ్, కొబ్బరి నూనె, సబ్బులు తక్షణమే ఇవ్వాలన్నారు. ఆదివారం రోజు పూర్తి సెలవు దినంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, బాబులాలు, నాగశేషులు, సాములు పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు, ఫిబ్రవరి 27: దోమలతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు అనారోగ్య నిర్వహణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, మెదడువాపు, చికున్ గున్యా వంటి వ్యాధులు సంక్రమిస్తాయని, ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీమత్, మాదన్న, రంగస్వామి, హెల్త్ సిబ్బంది కమాల్‌సాహెబ్, ఉమాబాయి, వనిత, తిరుమలమ్మ, పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకెపోగును పరామర్శించిన టీడీపీ నాయకులు



ఆకెపోగును పరామర్శిస్తున్న బీటీ నాయుడు, సోమిశెట్టి

కర్నూలు(అర్బన్)/ గూడూరు, ఫిబ్రవరి 27: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు ఆకెపోగు ప్రభాకర్‌ను ఆ పార్టీ నాయకులు మంగళవారం పరామర్శిం చారు. మహబూబ్ నగర్‌లోని నేహ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వేర్వేరుగా పరామర్శించారు. అదేవిధంగా ఆకెపోగు ప్రభాకర్‌ను గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు పరామర్శించారు. కార్యక్రమంలో కేఈ జగదీష్, డీ.జేమ్స్, గజేంద్ర గోపాల్, షేక్షా పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 27: నగరంలోని కొత్తపేటలో వెలసిన నాగసాయిబాబా ఆలయ 27 వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు సాయి బాబాకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులు హనుమాన్ చాలీసా, విష్ణుసహస్ర నామావళి పఠించారు. 11 గంటల నుంచి 12 వరకు కోలాటం, 12 గంట లకు బాబాకు హారతి ఇచ్చారు. అనంతరం చిన్నారుల భరతనాట్యం అలరించింది. దాతలు మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'టైలర్స్ డేను జయప్రదం చేయండి'

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 27: ప్రపంచ టైలర్స్ డేను జయప్రదం చేయాలని టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్ బాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం స్థానిక ఉర్దూఘర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో టైలర్స్ తరలిరావాలని పిలుపునిచ్చారు. టైలర్ల సమస్యల కోసం ప్రభుత్వంతో పోరాడి హక్కులు సాధించుకుందామని ఆయన అన్నారు.

వసతి గృహాల తనిఖీ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 27: రాయలసీమ యూనివర్సిటీలోని బాలురు, బాలికలు వసతి గృహాలను ఉపకులపతి బీ.సుధీర్ ప్రేమ్ కుమార్ మంగళవారం తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్సిటీ వైఫ్, లైఫ్ సైన్స్ విభాగాలను తనిఖీ చేసి విద్యార్థులు. అధ్యాపకుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజ నం అందించాలని సూచించారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న మొదటి సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.

చంద్రబాబును కలిసిన బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 27: విజయవాడలోని ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికారిక సభ్యుడు పంచలింగాలకు చెందిన బస్తిపాటి కురువ నాగరాజు మంగళవారం సాయంత్రం కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పిలుపు రావడంతో నాగరాజు హుటాహుటిన విజయవాడకు వెళ్లారు. అనంతరం ఉండవల్లిలోని చంద్రబాబు తన నివాసంలో దాదాపు 20నిమిషాలపాటు నాగరాజుతో మాట్లాడారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 27: పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం వెంకటస్వామి అన్నారు. మంగళవారం మండల ఐకేపీ కార్యాలయంలో పొదుపు మహిళలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం వెంకటస్వామి మాట్లాడుతూ మండలంలోని కొత్తకోట, పోలకల్లు, సి.బెళగల్ బ్యాంకుల పరిధిలోని పొదుపు గ్రూపులు మొత్తం 1385 సంఘాలు ఉన్నాయని, అందులో 965 గ్రూపులు మాత్రమే తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారని అన్నారు. మిగతా గ్రుపు సభ్యులు వెనుకబడ్డారని అన్నారు. పొదుపు మహిళలు, సీసీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

నేడు సున్నా వడ్డీ నిధులు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: కర్నూలు జిల్లాలో 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీని చెల్లించి అర్హత ఉన్న వారికి ఆ వడ్డీ డబ్బులను వారి ఖాతాలకు జమ చేసే కార్యక్ర మాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి బుధవారం చేపడుతారని కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. అదేవిదంగా 2021-22 రబీ సీజ న్‌కు సంబంధించి 17,142 మంది రైతులకు వడ్డీ డబ్బులను రీయింబర్స్‌మెంటు చేస్తామని ఆమె తెలిపారు. మొత్తం 76,851 మంది రైతులకు రూ.18.21 కోట్లు బుధవారం వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలిపారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేద్దాం: గౌరు చరిత



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 27: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరుచరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు చంద్రశేఖర్‌నగర్‌లో బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టాలని ప్రజలు, టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, పన్నులు, చార్జీల పెంపు, నిత్యావసర సరుకుల ధరలు, ఇసుక, భూ అక్రమాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాల న్నారు. కార్యక్రమంలో 19వ వార్డు ఇన్‌చార్జి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, కల్లూరు అర్బన్ వార్డు కన్వీనర్ పెరుగు పురు షోత్తంరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, బన్నూరు అశోక్‌కుమార్, పల్లె రఘునాథ్‌రెడ్డి, కిట్టు, వీరేంద్ర, సు బ్బు, జగదీష్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, కరిష్, జగదీష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

» విష్ణు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న జులకల్ సర్పంచు



టీడీపీలో చేరిన జులకల్ సర్పంచు విద్యావతి తదితరులు

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 27: కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు ప్రారంభమయ్యాయి. టీడీపీ అధినేత చంద్రబాబు టీడీపీ కోడుమూరు అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరికి టికెట్ కేటాయించడంతో వైసీపీ కార్యకర్తలు రెండురోజుల నుంచి వరుసగా టీడీపీలోకి చేరుతున్నారు. మంగళవారం గూడూరు మండలం జులకల్, పొన్నకల్ మజరా గ్రామ వైసీపీకి చెందిన సర్పంచు కల్లపరి విద్యావతి, వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి కల్లపరి దామోదర్‌రెడ్డితోపాటు మరికొంతమంది వైసీపీ కార్యకర్తలు కర్నూలులో టీడీపీ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్త గిరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి విష్ణు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సర్పంచులకు జగన్‌రెడ్డి ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వలే దని, ఐదేళ్ల కావస్తున్న గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయానని సర్పంచు విద్యావతి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని అందుకే ఆ పార్టీ వీడి విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ లో చేరుతున్నట్లు ఆమె ప్రకటించారు. టీడీపీలో చేరిన వారిలో జులకల్‌కు చెం దిన దేవిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అహమ్మద్, ఎలీషా, మాధన్న, లింగన్న, సుధాకర్, ఇశ్రాయేల్, లక్ష్మన్న, వెంకటేష్, నీలప్ప, పొన్నకల్‌కు చెందిన లింగన్న, నరసిం హుడు, నాగన్న, తిమ్మన్న ఉన్నారు.

● **టీడీపీలో చేరిన భూపాల్‌నగర్ వైసీపీ నాయకులు:** కర్నూలు రూరల్ మండలం నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న భూపాల్‌నగర్, మిలటరీ కాలనీతోపాటు వెంకాయపల్లె గ్రామాలకు చెం దిన వైసీపీ శ్రేణులతోపాటు కేఈ ఈశ్వరయ్యగౌడ్ టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. నందనపల్లె గ్రామానికి చెం దిన టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ వేమనగౌడ్ ఆధ్వర్యంలో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి సమక్షంలో వీరు పార్టీలో చేరారు. ఈశ్వరయ్య గౌడ్‌కు విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో బోయ లక్ష్మన్న, కురువకృష్ణ, కురువ చిన్న బీసన్న, ఈ.వెంకటేశ్వర్లు, కురువ స్వాములు, బాలముని, ఆనంద్ ఉన్నారు.

సమన్వయంతో ఎన్నికల నిర్వహణ: కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 27: రాబోవు ఎన్నికలను అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని కర్నూలు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ), కార్పొరేషన్ కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, నిఘా విభాగం అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ నిఘా, వీడియో నిఘా సభ్యులకు ఆయన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసీసీ 3, ఎఫ్ఎస్‌టీ 3, ఎస్ఎస్‌టీ 3, వీఎస్‌టీలను మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క టీంలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, పోలీసు అఫీషియల్, క్లర్క్, వీడియో గ్రాఫ్, ఒక హెల్పర్ ఉంటార న్నారు. అనంతరం ఫారం 6,7,8ల ఆన్‌లైన్ క్లియరెన్స్ పురోగతిని అడిగి తెలు సుకున్నారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓ, కర్నూలు అర్బన్ తహసీల్దారు మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, రెండో, మూడో పట్టణ సీఐలు ఇంతి యాజ్, మురళీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

కర్నూలు(కల్చరల్): పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై అధికారులతో, అన్ని రాజకీయ పార్టీల అధికారిక ప్రతినిధులతో కర్నూలు నియోజకవర్గ ఎన్నికల అధికారి, కమిషనర్ భార్గవతేజ సమావేశం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఫారం 6, 7, 8 ఆన్‌లైన్ క్లియ రెన్స్, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా కొన్ని పోలింగ్ స్టేషన్ల స్థానాల మార్పులపై ఆయన తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో చర్చించారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 27: పాడి పశువులకు జబ్బవాపు టీకాలు తప్పని సరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి ప్రవీన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, బ్యాతోలి గ్రామాల్లోని రైతులకు జబ్బవాపుపై అవగాహన కల్పించారు. ఈసందర్భగా పశువైద్యాధికారి ప్రవీన్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని రైతులకు పాడి పశువులకు పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వాలన్నారు. పశువులకు టీకా లు వేయించడం వల్ల వాటిలో నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకం దారులు కూడ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు, వెటర్నరి అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉద్యోగులపై ప్రభుత్వం మొండివైఖరి'



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 27: ఉద్యోగులపై ప్రభుత్వం మొండి వైఖరి అవలబిస్తుందని, పాత పింఛన్ హామీ ఇచ్చే వారికి తమ మద్దతు ఇస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికు మార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్ అన్నారు. మంగళవారం సాయం త్రం స్థానిక కేకే భవన్ ఆవరణంలో ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీలు ఇవ్వని పక్క రాష్ట్రాలు పాత పింఛన్ విధానం వైపు అడుగులు వేస్తుంటే.. హామీ ఇచ్చిన సీఎం జగన్ ఉద్యోగులను మోసగిస్తుండటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్ర మంలో అధ్యక్షులు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యేహోషువా, కార్యదర్శులు తిమ్మన్న, దుర్గా, మండలాల అధ్యక్షులు ప్రసాద్, సురేష్, హనుమన్న, మారెప్ప, షబ్బీర్, కాంతారావు, రాముడు పాల్గొన్నారు.

విహారికి కెప్టెన్సీని ఇవ్వాలి: టీడీపీ

ఓర్వకల్లు, ఫిబ్రవరి 27: ఆంధ్రా క్రికెటర్ హనుమ విహారికి రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ను నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం హుశేనాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ జట్టులో 17వ స్థానంలో ఉన్న వైసీపీ నేత కుమారుడి కోసం ఆంధ్రా రంజీ కెప్టెన్సీని హనుమ విహారిని తొలగించేలా వైసీపీ నేతలు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. విహారిని తిరిగి కెప్టెన్‌గా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రా క్రికెట్‌లో వైసీపీ రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

చట్టాన్ని ధిక్కరిస్తే చర్యలు: ఎస్ఐ

సి.బెళగల్, ఫిబ్రవరి 27: చట్టాన్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పోలకల్లు, ఇనగండ్ల గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలసి జీవించాలన్నారు. ఎస్ఐ వెంట హెడ్ కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

పోలియో నిర్మూలనకు కృషి చేద్దాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్, డీఐవో ప్రవీణ్ కుమార్, తదితరులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 27: జిల్లాలో పోలియో నిర్మూలనకు అందరూ కృషి చేద్దామని, మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వై.భాస్కర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వై.ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీలో పల్స్ పోలియోపై పీహెచ్‌సీ వైద్యాధికారులకు క్షేత్రస్థాయి పర్యవేక్షకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన శిశువు నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మార్చి 3న చుక్కలు వేయించుకోలేని వారికి 4, 5 తేదీల్లో పల్స్ పోలియో బృందాలు ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయాలని ఆదేశించారు. 6వ తేదీ వరకు పట్టణ ప్రాంతాల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో క్షేత్రస్థాయిలోని సిబ్బంది ద్వారా ఎంత మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారో సర్వే చేయించి ఎంత వ్యాక్సిన్ అవసరమో ఇండెంట్ పెట్టి తీసుకోవాలన్నారు. బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో, ఇటుక బట్టిలలో పని చేసే పిల్లలకు, సంచార జాతుల వారి పిల్లలను, క్వారీల్లో పని చేసే పిల్లలను గుర్తించి వ్యాక్సిన్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంవో ఉమా, డెమో ప్రమీలమ్మ, ఎస్‌వో హేమసుందరం, డీపీహెచ్ఎన్‌వో ఇందిరా, జిల్లా మాస్ మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు చీరెల షోరూమ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 27: ఎస్ఆర్ పేటలోని డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి డెంటల్ హాస్పిటల్‌పై అంతస్తులో లక్కిరెడ్డి సువర్ణమ్మ గద్వాల, పోచంపల్లి పట్టు, శిల్క్ చీరెల షోరూమ్‌ను మంగళవారం కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎస్వీ విజయ మనోహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. షోరూమ్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల పట్టు చీరెలను ఆమె పరిశీలిం చారు. ఈసందర్భంగా విజయమనోహరి మాట్లాడుతూ షోరూమ్‌లో అన్ని వర్గాల ప్రజలకు అనుగుణమైన ధరల్లో పట్టు చీరెలను అమ్మకాలకు పెట్టడం అభినందనీయమని అన్నారు. మహిళలు మెచ్చే డిజైన్లలో, రంగుల్లో గద్వాల, పోచంపల్లి పట్టు, శిల్క్ చీరెలు ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణుడు డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రయోగాలు ఎంతో అవసరం

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 27: విద్యార్థులకు ప్రయోగాలు ఎంతో అవసర మని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ అన్నారు. మంగళవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శాస్త్ర, సాంకేతిక ప్రదర్శన జరిగింది. పవన విద్యుత్, సౌర విద్యుత్, స్పెన్సర్లు, మరమనిషి, స్వదేశి సాంకేతికత నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో దేవికారాణి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎం శారద, జి.మహ బూబ్ బాషా, ఎస్, వాసవిదేవి, పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 27: రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. మంగళవారం రాత్రి పాతనగరంలోని పూలబజార్‌లో చేపట్టిన ప్రజాపోరు యాత్ర-2 పూల బజార్ నుంచి ప్రధాన రహదారుల మీదుగా పాతబస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాఘవేంద్ర మా టాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల అభివృద్ధికి విద్య, పరిశోధన రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఉన్నత విద్యా సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పారన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సందడి సుధాకర్, లెనిన్‌బాబు, నాగేశ్వరావు, శ్రీరాములుయాదవ్, లోకేశ్వరయ్య, రామాంజినేయులు, బెస్త ఈరన్న, చంద్రశేఖర్, మధుగౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మూలనపడిన వైఎస్సార్ సుజల స్రవంతి

● గత ప్రభుత్వంలో ఏర్పాటు ● నెరవేరని లక్ష్యం



కోడుమూరులో మూతబడిన మదర్‌ప్లాంటు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 27: ఫ్లోరైడ్ బారిన పడిన ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలన్న సంకల్పంలో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం మూలనపడింది. ఈ పథకం కింద గ్రామాల్లో రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేశారు. వీటికి అనుబంధంగా మదర్ ప్లాంట్ ఉంటుంది. అక్కడ ఫిల్టర్ చేసిన నీటిని తరలించి ఆర్డీయూలో అమర్చిన ట్యాంకులో నింపుతారు. ప్రజలు తమకు అందించిన స్మార్ట్‌కార్డును వినియోగించుకుని సురక్షిత తాగునీరు పొందవచ్చు. ఈ పథకం ద్వారా రూ.2కు సురక్షిత తాగునీరు అందించాలని ప్రభుత్వ సంకల్పించింది. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఎన్నికలు రావడంతో ఆర్డీయూ ఏర్పాటు పనులు ఆగిపోయాయి. ఈ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకం పేరును వైఎస్సార్ సుజల స్రవంతిగా మార్చేసింది. అయితే కొన్ని నెలలుగా గ్రామాల్లోని ఆర్డీయూలకు ఫిల్టర్ నీరు అందక లక్ష్యం నెరవేరడం లేదు.

● **మూతబడిన మదర్ ప్లాంట్:** కోడుమూరులో ఏర్పాటు చేసిన మదర్ ప్లాంట్ కొన్ని నెలలుగా మూతబడింది. ఇక్కడ సుమారు గంటకు 10 వేల లీటర్ల నీటిని ఫిల్టర్ చేసే సామర్థ్యం ఉన్న యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి పులకుర్తి, కల్లపరి, ప్యాలకుర్తి, కొత్తూరు, క్రిష్ణాపురం, గుడిపాడు తదితర గ్రామాలకు సరఫరా చేసేవారు. అయితే సుమారు ఆరునెలలుగా మదర్ ప్లాంటు మూతబడింది. దీంతో వైఎస్సార్ సుజల స్రవంతి ఆర్డీయూలు దిష్టిబొమ్మలుగా మారాయి. మదర్ ప్లాంటు మూతకు ప్రధాన కారణం బిల్లులు పెండింగ్‌లో ఉండడమేనని తెలుస్తోంది. ప్లాంట్ మూతబడడంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది ఉపాధి కోల్పోయారు. అయితే సిబ్బందికి సైతం జీతాల బకాయిలు ఉన్నాయని తెలిసింది.

● **బురదనీరు తాగుతున్న కొత్తూరు ప్రజలు:** మండలంలోని కొత్తూరు గ్రామ ప్రజలకు తాగునీటి వనరులు లేవు. ఇక్కడ బోర్లు తవ్వించినా నీరు ఉప్పగా ఉన్నాయి. దీంతో ఏళ్లగా ఉన్న కుంటనీరే తాగడానికి గతి అయ్యింది. కుంటలోకి టీబీపీ లేదా జీడీపీ నీటిని విడిపించుకుని వాటినే తాగేవారు. అయితే సుమారు ఏడాది క్రితం వైఎస్సార్ సుజల స్రవంతి పథకం ప్రారంభించడంతో గ్రామప్రజలు ఎంతగానో సంతోషించారు. కుంటనీరు తాగే బాధ తప్పిందని అనుకున్నారు. వారి ఆనందం ఆవిరవుతూ ఆర్డీయూ కొన్ని నెలలకే మరమ్మతుకు గురైంది. దీంతో కొంతకాలం పాటు ట్యాంకరు ద్వారా ఫిల్టర్ నీరు అందించారు. అయితే మదర్ ప్లాంటు మూతబడడంతో ప్రజలకు తిరిగి కుంట నీరే దిక్కయ్యింది. కొందరు నాగలాపురం, కోడుమూరు నుంచి నీటిని కొని తెచ్చుకుంటున్నారు. ఆర్డీయూ ద్వారా సురక్షిత నీరు అందుతున్న కారణంగా కుంటకు నీరు విడుదల చేయలేదు. ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయింది. నీటిని కొనుగోలు చేసుకునే స్తోమత లేనివారు మరో మార్గంలేక కుంటలో అడుగంటిన నీటినే తాగడానికి తీసుకుంటున్నారు. కుంటనీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు. సుమారు 200 గృహాలు ఉన్న చిన్న గ్రామంలో 300 పైగా స్మార్ట్ కార్డులు ఉన్నాయంటే, ఇక్కడ తాగునీటి అవసరం ఎంతో అర్థం చేసుకోవచ్చు. చాలామంది కార్డులకు రూ 500కే పైగానే రీచార్జి చేసుకున్నారు. ఫిల్టర్ నీరు అందకపోవడంతో సొమ్ము వినియోగించుకునే అవకాశం లేకపోయిందని గ్రామస్థులు వాపోయారు.

కుంటనీరు తాగి ఆసుపత్రిపాలయ్యా



ఫిల్టర్ నీరు అందకపోవడంతో కుంటనీరు తాగుతున్నా. గత పదిరోజుల క్రితం జ్వరం, విరేచనాలతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాను. గ్రామంలో తాగునీటి వనరులు లేవు. పొలాల వద్ద కూడా తాగు నీటి సదుపాయాలు లేవు.

- యల్లయ్య, కొత్తూరు

రూ.15కు బిందె నీరు



సుమారు ఆరునెలలుగా గ్రామంలో తాగునీటికి ఇబ్బందిగా ఉంది. ఫిల్టర్ నీరు అందక, కుంటలో నీరు అడుగంటి పోవడంతో పక్క గ్రామాల నుంచి తాగునీరు కొంటున్నాం. బిందె నీరు రూ.15, వాటర్ క్యాన్ రూ. 20 చొప్పున చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. సైకిళ్లు, బైక్‌లు ఉన్నవాళ్లు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

- బడెమ్మ, కొత్తూరు

మరమ్మతు చేయిస్తాం

ఆర్డీయూలకు ఫిల్టర్ నీరు అందించకపోవడం నిజమే. మదర్‌ప్లాంటు, కొన్ని ఆర్డీయూలలో మరమ్మతులు ఉన్నాయి. కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో నోటీసు ఇచ్చాం. బిల్లుల పెండింగ్ ఉన్నట్లు తెలీదు. బిల్లులు పంపించాం. మరమ్మతుల కోసం రూ 6.3 లక్షలతో టెండర్ అయ్యింది. త్వరలోనే పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తెస్తాం.

- ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజీనామా

రేపు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 27: వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వి.నాగరాజు ఆపార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. రాయలసీమ విద్యార్థి. యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ బి.శ్రీరాములు వెంట నడవాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా శ్రీరాములు, నాగరాజులు బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. వైసీపీ విద్యార్థి విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న వి.నాగరాజు రాజీనామా చేయడం ఆ పార్టీకి గట్టిషాక్ తగిలినట్లయింది.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

గూడూరు, ఫిబ్రవరి 27: రానున్న ఎన్నికల్లో ఎవ్వరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్ల గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతగా నిర్వహిం చేందుకు అందరూ సహకరించాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 27: మండలంలోని వెంకటగిరి సమీపంలో పంటకాల్వ పూడికతీత పనులను మంగళవారం డ్వామా పీడీ అమర్ నాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ఉదయానే పనులకు హాజరు కావాలని, నిర్ణీత కొలతలు పని చేసి పూర్తి వేతనం రూ.272 పొందాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో మోదీన్‌బాషా, ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తం ఉన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 27: విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయ రాష్ట్ర కార్యదర్శి ఎన్ గీత కోరారు. మంగళవారం కేజీబీవీలో ఎఫ్ఏ-4 పరీక్షలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి బాలికలకు పలు సూచనలిచ్చారు. అనంతరం ఉపాధ్యాయినులతో సమావేశం నిర్వహించి చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం సరుకుల గదిని పరిశీలించి చిక్కీలు, అరటి పండ్ల నాణ్యతను తనిఖీ చేశారు. ఆమె వెంట జీసీడీవో సునీత, ప్రిన్సిపాల్ గౌసియాబేగం ఉన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ పరికరాల పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: నూతన ఆవిష్కరణలు చేపట్టి దేశ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు రాఘవేంద్ర అన్నారు. మంగళవారం మిల్టన్ గ్రామర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నేషనల్ సైన్స్‌డేను పురస్కరించుకొని సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు మేధోసంపత్తికి పదును పెట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైన్స్ ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ, నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, సీఈవో వెంకటేష్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల పదోన్నతులపై నిర్లక్ష్యం'

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం ఎస్టీయూ పట్టణ కమిటీ ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు. జీవో నెంబర్ 117ను కొనసాగించి ఉపాధ్యాయుల పోస్టులను హేతుబద్ధీకరణ చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి టీమ్‌రాజ్, లోక్యనాయక్, జంబులయ్య, ప్రహ్లాద, సుధాకర్, రాజా సతీష్, ప్రసాద్, మారయ్య, వీరేష్ పాల్గొన్నారు.

యాదవ సాధికార కమిటీ కన్వీనర్‌గా రంగస్వామి

మద్దికెర, ఫిబ్రవరి 27: మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన మూలింటి రంగస్వామిని టీడీపీ జిల్లా యాదవ సాధికారిక జిల్లా కన్వీనర్‌గా ఎంపిక చేసినట్లు టీడీపీ రాష్ట్ర యాదవ సాధికారిక అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ మంగళవారం ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా మూలింటి రంగస్వామి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో యాదవులకు పెద్దపీట వేసింది టీడీపీనేనని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో యాదవులంతా బీసీల పార్టీ అయిన టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

'విద్యార్థులను మభ్యపెడుతున్న ప్రభుత్వం'

ఆదోని, ఫిబ్రవరి 27: ప్రచార ప్రకటనలతో వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను మభ్యపెడుతోందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బెస్త జయసూర్య బల్లేకల్లు సూర్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రామాంజనేయులు పాల్గొని మాట్లాడారు. పట్టణంలో నాలుగు ఏళ్ల క్రితమే ఐటీఐ కళాశాల పూర్తి అయినప్పటికీ, టీడీపీకి పేరు వస్తుంది అన్న అక్కసుతో కళాశాల నేటికి నిరుపయోగకరంగానే ఉంచారని విమర్శించారు. కార్యక్రమంలో తేజ, నూర్, విష్ణు, రఘు, నవీన్, హేమంత్, రాజు, సుధీర్, తాహెర్ పాల్గొన్నారు.

ముగిసిన వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారి వినోద్‌కుమార్

ఆలూరు, ఫిబ్రవరి 27: ఆలూరు సెబ్ స్టేషన్‌లో మంగళవారం సెబ్ అసిస్టెంట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు వేలం పాటను నిర్వహించగా రూ.2,67,500 (జీఎస్టీతో రూ.3,15,650) ఆదాయం సమకూరిందన్నారు. ఈ వేలంపాటలో సీఐ సోమశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

20 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని: పట్టణంలోని శాంతి ఎస్టేట్‌లోని రాజీవ్ నగర్ కాలనీలో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా ఇద్దరు వ్యక్తులు ఆటోలో తరలిస్తున్న 20 బాక్సుల మద్యాన్ని టూటౌన్ సీఐ గోపినాథ్, ఎస్సై తిరుపాల్ స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై, ఏఎస్సైలను డీఎస్పీ శివనారాయణ స్వామి అభినందించారు. మద్యంతో పట్టుబడిన వెంకటేష్, శ్రీనివాసులను కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

మంత్రాలయం టికెట్ తిక్కారెడ్డికే ఇవ్వాలి

● టీడీపీ కోసిగి మండల ఏకగ్రీవ తీర్మానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోసిగి, ఫిబ్రవరి 27: మంత్రాలయం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టికెట్ మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డికే ఇవ్వాలని టీడీపీ మండల కమిటి ఏకగ్రీవ తీర్మానం చేసిందని మండల కన్వీనర్ జ్ఞానేష్, భరద్వాజశెట్టి, వక్రాణి వెంకటేష్, నాడిగేని అయ్యన్న, పంపాపతి తెలిపారు. మంగళవారం కోసిగిలోని బీరప్ప స్వామి కళ్యాణమండపంలో టీడీపీ మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి మంత్రాలయం టీడీపీ టికెట్ తిక్కారెడ్డికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలో పది సంవత్సరాలుగా కార్యకర్తలకు, నాయకులకు అన్ని వేళలా అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. మంత్రాలయం టీడీపీ టికెట్ వేరే వారికి ఇస్తే సహకరించేది లేదని తేల్చి చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొండగేని వీరారెడ్డి, కోసిగయ్య నాడిగేని మహదేవ, రణతిక్కన్న, ఉమర్‌సాబ్, కప్పయ్య, వడ్డె రామయ్య, డీలర్ నర్సన్న, శ్రీనివాసులు, కలందర్, నరసింహులు, గవిగట్టు వీరయ్య, గుండాల ఈరయ్య, మదిరవీరారెడ్డి, ఎంపీటీసీ రాజు, నీలకంఠ, నాగరాజు తదితరులు ఉన్నారు.

మైనార్టీల అభివృద్ధే ధ్యేయం : విరుపాక్షి



మాట్లాడుతున్న బుసినే విరుపాక్షి

చిప్పగిరి, ఫిబ్రవరి 27: ముస్లిం మైనార్టీల అభివృద్ధే ధ్యేయమని ఆలూరు వైసీపీ సమన్వయ కర్త బుసినే విరుపాక్షి అన్నారు. మంగళవారం మండల కేంద్రం చిప్పగిరిలో ఖాన్ ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత, చిప్పగిరి కో-ఆప్షన్ మెంబర్ సర్వర్ ఖాన్ తన స్వగృహంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సత్తార్ ఖాన్, ముల్లా రఫి పాల్గొన్నారు.

కన్నీటి కష్టాలు

● రోజురోజుకూ తీవ్రమవుతున్న తాగునీటి సమస్య
● కర్ణాటక నుంచి పైపులైన్ ద్వారా మాధవరం గ్రామానికి తాగునీరు



ఎండిపోయిన తుంగభద్ర నదిలో పైపులైన్ వేసిన దృశ్యం

మంత్రాలయం, ఫిబ్రవరి 27: తుంగభద్ర నదిలో నీరు అడుగంటింది. పరిసర గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. మండలంలోని మాధవరం గ్రామానికి కర్ణాటక నుంచి పైపులైన్‌ద్వారా తాగునీరు సరఫరా చేసి గ్రామస్థుల దాహార్తి తీరుస్తున్నారు. అయినా ఇవి ఏ మాత్రం గ్రామస్థుల అవసరాలకు సరిపడడం లేదు. మాధవరం గ్రామ పంచాయతీ నుంచి దాదాపు రూ.2 లక్షలు ఖర్చు పెట్టి మూడు ఇంచుల పీవీసీ పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆంధ్రలో నీరు దొరక్క కర్ణాటక వైపు అధికారులు పరుగులు పెట్టి నది ఒడ్డున ఉన్న కర్ణాటకలోని పాత తుంగభద్ర గ్రామానికి చెందిన తెలుగు తిక్కన్న అనే రైతు నుంచి మూడు నెలలకు రూ.లక్ష చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కర్ణాటక నుంచి పైపులైన్ ద్వారా మాధవరం గ్రామ తాగునీటి గుంతలోకి నీరును వదిలి అక్కడి నుంచి నీటిని ట్యాంకులకు ఎక్కించి సరఫరా చేస్తున్నారు. పైపులైన్‌కు దాదాపు 140 పైపులతో సహా, కూలీలు రూ.లక్ష దాకా ఖర్చు చేసి నీటిని అందిస్తున్నారు. నెల రోజులకు పైగా మాధవరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా తీర్చేదారి లేక కర్ణాటక నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే తుంగభద్ర నది రాళ్లు, రప్పలు తేలి కళాహీనంగా మారి ఎడారిగా మారింది. దిక్కుతోచని స్థితిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్, మాజీ సర్పంచు రఘునాథరెడ్డి కర్ణాటక నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆంధ్రలో సీఎం జగన్ తాగునీటి కోసం పంచాయతీకి నిధులు కేటాయించకపోవడంతో కర్ణాటక నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మాధవరం గ్రామానికి రావాల్సిన దిబ్బనదొడ్డి ఎస్ఎస్ ట్యాంకు నీరు ఒక్క చుక్క విడుదల చేయకపోవడం గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

తాగునీటి వృథాను అరికట్టండి

తుగ్గలి : వర్షాభావ పరిస్థితులతో బావులు, బోర్లు ఇంకిపోయి చుక్కనీరు అందడం లేదు. ఇలాంటి తరుణంలో ఉన్న కొద్ది నీరు కూడా పైపు లీకేజీ అయి వృథాగా పారుతున్నా అధికారులకు పట్టడం లేదు. రాతనలో పాఠశాల పక్కన పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న పైపులైన్లు లీకై వృథాగా తాగునీరు పారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు మురుగునీటిపాలవుతుందని, మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నగరూరులో దాహం దాహం



లీకేజీ నీటినీ తోడుకుంటున్న దృశ్యం

ఆస్పరి, ఫిబ్రవరి 27: నగరూరు గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. నెల రోజులుగా తాగునీరు అందక గారమస్థులు తల్లడిల్లుతున్నారు. కిలోమీటర్‌ల దూరంలో లీకేజీ నీటినీ తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి నాగనాథనహళ్లి రిజర్వాయరు నీరు సరఫరా అవుతుండగా.. నెల రోజులుగా సరఫరా నిలిచిపోయింది.

కపటిలో తాగునీటి కష్టాలు



కపటిలో తాగునీటి కోసం తోపుడుబండ్లతో వెళ్తున్న గ్రామస్థులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 27: వేసవి కాలం రాకమునుపే గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని కపటి, గణేకల్లు, ఆరేకల్లు, చిన్నహరివాణం తదితర గ్రామాల ప్రజలు తాగునీటి కోసం పొలాల బాట పడుతున్నారు. రాత్రి, పగలుతేడా లేకుండా పనులకు వెళ్లకుండా ప్రజలు రైతులు పంట పొలాల్లో వేసిన బోర్లను ఆశ్రయిస్తున్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి

తుగ్గలి, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. మంగళారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి అన్నింటికీ రుణ సౌకర్యాలు కల్పించారని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అన్ని సంక్షేమ పథకాలు అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని పాతాలానికి తొక్కారని, దీని వల్ల ప్రజాజీవనం అతలాకుతలం అయ్యిందని విమర్శించారు. నిత్యావసర సరుకులతో పాటు కరెంటు బిల్లులు, పెట్రోల్ ధరలు అమాంతంగా పెంచి సామాన్యులపై అధిక భారాలు మోపిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ఎస్టీ సెల్ నాయకులు రాము నాయక్, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల నిర్వహణపై సమీక్ష

ఆదోని, ఫిబ్రవరి 27: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ఏదైనా సందేహాలు ఉంటే తెలపాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్, శివనారాయణ్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో కొన్ని ఎన్నికల కమిషన్ నిబంధనలు లేని వాటి స్థానంలో హేతుబద్ధీకరణలో భాగంగా నియమించబడిన పోలింగ్ కేంద్రాలపై ఏదైనా సందేహాలు ఉంటే తమ దృష్టి తీసుకొని రావాలని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎలక్షన్ సీనియర్ సహాయకులు ఖాసీం, వీఆర్వో రాజశేఖర్ గౌడ్, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి రథోత్సవాలు ప్రారంభం

పత్తికొండ, ఫిబ్రవరి 27 : పత్తికొండ పట్టణంలో ప్రసిద్ధిచెందిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ రథోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఆలయ అర్చకులు బ్రహ్మయ్యఆచారి, ఆలయ నిర్వాహకసభ్యులు ఎల్లారెడ్డి, తుప్పటినాగన్నల నేతృత్వంలో కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 11గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సం, సాయంత్రం ప్రభోత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఈవో

పత్తికొండలో 10 రోజులపాటు జరిగే తిరనాళ్ల ఉత్సవాలకు సంబంధించి గ్రామపంచాయతీ ఈవో నరసింహులు మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. పారిశుధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చెత్తను వాహనాలలో తరలించాలని సిబ్బందికి సూచించారు.

రాజారెడ్డినగర్‌లో పాస్టర్లకు ఇల్లు కేటాయించాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 27: పత్తికొండ పట్టణంలో రాజారెడ్డి నగర్‌లో పాస్టర్లకు ఇల్లును కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పత్తికొండలో పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పాస్టర్లకు సొంత గృహాలు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి పాలకులు విస్మరించారన్నారు. ఇప్పటికైనా పాస్టర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపి స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించాలని కోరారు. పాస్టర్లు రంగన్న, రాజు, జోసెఫ్, ఆనంద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నలకదొడ్డి ఉరుసులో కేఈ శ్యాంబాబు



దర్గాలో మస్తాన్‌స్వామికి ప్రార్థనలు చేస్తున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఫిబ్రవరి 27 : పత్తికొండ మండలపరిధిలోని నలకదొడ్డి గ్రామంలో ప్రసిద్ధి చెందిన మస్తాన్‌స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు పాల్గొని దర్గాలో ప్రత్యేకపార్థనలు చేశారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు మాజీ సర్పంచ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోక్‌నాథ్ ఘనస్వాగతం పలికారు. మేళతాలాలలో ఊరేగింపుగా దర్గాను చేరుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం బత్తిని లోక్‌నాథ్ ఇంటివద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని నియోజకవర్గంలో పార్టీగెలుపు కోసం ప్రతిఒక్కరూ పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆయనతోపాటు టీడీపీ సీనియర్‌నాయకులు నలకదొడ్డి బత్తిన లక్ష్మీనారాయణ, బత్తిన కుబేర్‌నాథ్, బత్తిని రాజశేఖర్‌లతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల మీట్ మమ!

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 27: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల ప్రజాపరిషత్ సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి మండల మీట్‌లో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపైన అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చలు జరిపి వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. కానీ ఇక్కడ ప్రజాప్రతినిధుల సభ్యులతో సజావుగా సాగాల్సిన మండల మీట్ నిర్వహించాలి కాబట్టి నిర్వహించినట్లు మమ అనిపించారు. మంగళవారం పత్తికొండ మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరిగింది. మండలంలో 20 మంది ఎంపీటీసీలు ఉన్నారు. అందులో అధికంగా వైసీపీ ఎంపీటీసీలు ఉండగా.. టీడీపీ, సీపీఐ సభ్యులు కూడా ఉన్నారు. ప్రతి మండల మీట్‌లో ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో సర్వసభ్య సమావేశం జరిగేది. అయితే ఈసారి జరిగిన మండల మీట్ మండల పరిషత్ అధికారులు సక్రమంగా సమాచారం ఇవ్వకపోవడం గుట్టుచప్పుడుగా మండల మీట్‌ను జరుపుకున్నారనే అన్న అనుమానాలు ప్రజాప్రతినిధుల్లో వ్యక్తమయ్యాయి. 20 మంది ఎంపీటీసీలకు గాను కోరం ప్రకారంగా హాజరు కావాల్సి ఉండగా.. కోరం లేకుండానే మండల మీట్ అధికారులు జరిపినట్లు ప్రజాప్రతినిధులే ఆరోపిస్తున్నారు. సమావేశం ప్రారంభం కాకముందే కొంత మంది ఎంపీటీసీలు వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి తమ పనులపైన బయటకు వెళ్లినట్లు తెలుస్తుంది. సమావేశంలో మాత్రం కేవలం కోరం ప్రకారంగా పది మంది ఉండాల్సి ఉండగా.. 8 మంది ఎంపీటీసీ సభ్యులే హాజరైనట్లు కనిపించారు. ఆ సభ్యుల్లో కూడా తమ గ్రామాల్లో జరుగుతున్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చినా సమాధానం లేకపోవడంతో ప్రతిపక్ష టీడీపీ, సీపీఐ ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. గత సమావేశంలో చేసిన తీర్మానాలకే దిక్కు లేకుంటే ఈ మండల మీట్ ఎందుకంటూ ఈ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే సమావేశం జరుగుతుండగానే.. అటు ప్రతిపక్షపార్టీల సభ్యులు, అధికార పార్టీల సభ్యులు, అధికారులతో సైతం ఒక్కొక్కరుగా బయటకు వెళ్లి చర్చలు పెట్టుకున్నారు. బయట ఉన్న వారు సమావేశానికి రావాలంటూ స్వయాన ఎంపీడీవో రామారావు బతిమాలిన పరిస్థితి నెలకొంది.

సుజాతమ్మకే టీడీపీ టికెట్ ఇవ్వాలి

● అధిష్ఠానాన్ని కోరిన కార్యకర్తలు



మాట్లాడుతున్న హొళగుంద టీడీపీ నాయకులు

హొళగుంద, ఫిబ్రవరి 27: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టికెట్టు కోట్ల సుజాతమ్మకు కేటాయించాలని టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు చిన్నహ్యాట శేషగిరి, హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వందవాగిలి రామలింగారెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ఆలూరులో 25 ఏళ్లగా టీడీపీ జెండా ఎగరలేదని, ఈసారి టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. ఎల్లార్తి దర్గా డబ్బు దోచుకుని, నాటుసారా, మట్కా, పేకాట ఆడించేవారు కూడా సుజాతమ్మకు పోటీగా వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. సుజాతమ్మకే ఆలూరు అసెంబ్లీ స్థానం కేటాయించాలని కోరారు. మైనార్టీ నాయకుడు ఆదాం, కాకి సీతయ్య, దిడ్డి తిక్కస్వామి, మంగలి చంద్రశేఖర్, వీరేంద్ర, గజేహాళి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ చేరుకున్న ఇంటర్ ప్రశ్నపత్రాలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాలు ఆదోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలను కస్టోడియన్ డేవిడ్, హసీనా ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న ప్రశ్నపత్రాలను పరిశీలించి భద్రపరిచారు. ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు సంబంధించి సెట్-ఏ, సెట్-బీ మొదటి విడతగా వచ్చాయన్నారు. పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాలలో రెండు సెంటర్లు, ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల, అక్షర శ్రీ, నారాయణ, బాలాజీ, సాయి జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

'ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'

మంత్రాలయం, ఫిబ్రవరి 27: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో తమకు కేటాయించిన రూట్లు, సెక్టారు , పోలింగ్ బూతుల వ్యవహారంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే.. వేటు తప్పదని మంత్రాలయం రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళి అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో కోసిగి, పెద్దకడుబూరు మండలాల రూటు, సెక్టార్ల పోలింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

నిందితుడి అరెస్టు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 27 : పాండవగల్లుకు చెందిన జనసేన మండల అధ్యక్షుడు తాహేర్ వలిపై హత్యయత్నం చేసిన తమ్ముడు దాదాబాషా అలియాస్ బుడ్డాను పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ పీరయ్య మాట్లాడుతూ.. తాహేర్‌కు, అతని తమ్ముడు దాదాబాషకు మధ్య కొన్ని రోజులుగా ఆస్తి విషయంలో తగాదా నడుస్తోందన్నారు. దీనిని మనస్సులో పెట్టుకున్న దాదాబాషా గడిచిన శనివారం ఆదోనిలో నివాసం ఉంటున్న తాహేర్ వలిని పాండువగల్లుకు పిలిపించాడని, అర్ధరాత్రి దాటిన తరువాత నిద్రిస్తున్న తాహేర్ వలిపై గడ్డపారతో తలపై బలంగా పలుమార్లు మోదాడని పేర్కొన్నారు. ప్రస్తుతం తాహేర్ వలి కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, కేసు విచారణలో భాగంగా, నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించామని, ఆదోని కోర్టు 15రోజులపాటు రిమాండ్‌కు ఆదేశించిందని ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

ఆదోని టౌన్, ఫిబ్రవరి 27: మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రఘునాథ్ రెడ్డిను ప్రొద్దుటూరుకు బదలీ చేస్తూ మంగళవారం డీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా డాక్టర్ అనుమపకు ఇన్‌చార్జిగా అప్పగించి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో బాపట్ల మున్సిపాల్టీలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రామచంద్రా రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రఘునాథ్ రెడ్డి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నర కాలంలోన బదిలీ కావడం పై పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు, పలు అవినీతి ఆరోపణలు రావడంతో హఠాత్తుగా బదిలీ జరిగినట్లు సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

మంత్రాలయం మఠం హుండీ ఆదాయం రూ.2.54 కోట్లు

మంత్రాలయం, ఫిబ్రవరి 27: రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,53,73,131 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. మంగళవారం జనవరి 2 రోజులతో పాటు ఫిబ్రవరి 27 రోజులకు సంబంధించిన 29 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.2,53,73,131 నగదుతో పాటు 1.679 కేజీల వెండి, 92 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్ అనంత పురాణిక్, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, వాణి, గురురాజ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్‌పై హామీ ఇచ్చేవారికే ఓటు

మద్దికెర, ఫిబ్రవరి 27: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత పెన్షన్‌పై హామీ ఇచ్చేవారికే వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జీ నాగరాజు, మండల ఆర్థిక శాఖ కార్యదర్శి విశ్వనాథ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ హామీలు ఇవ్వని పక్క రాష్ట్రాల్లో సైతం పాత పెన్షన్ విధానంపై అడుగులు వేస్తుంటే.. సీఎం జగన్ ఉద్యోగులను మోసగించడం చాలా అన్యాయమని అన్నారు.

సంక్షిప్త సమాచారం

గుట్టుచప్పుడు కాకుండా మండల సమావేశం

కౌతాళం, ఫిబ్రవరి 27: మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించి చేతులు దులుపుకున్నారని పలువురు సభ్యులు వాపోయారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ రఘునాథగుప్త ఆధ్వర్యంలో ఎంపీపీ అమరేశ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. గతంలో మండల సమావేశం నిర్వహిస్తే ముందుగా ఆయా శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు పత్రికా విలేఖులకు సమాచారం ఇచ్చేవారు. అయితే నూతన ఎంపీడీఓగా విధులు చేపట్టిన రఘునాథగుప్త పత్రికా విలేకరులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడాన్ని పలువురు తప్పుబట్టారు.

అవకాశమొస్తే పోటీ చేస్తా : మురహరిరెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 27: పదేళ్లుగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీని బలోపేతం చేస్తూ బూత్ స్థాయిలో కార్యకర్తలను సమీకరిస్తు ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నానని, 2024ఎన్నికల్లో అవకాశం వస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని బీజేపీ ఎమ్మిగనూరు కన్వీనర్ కేఆర్ మురహరి రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇతర పార్టీలతో పొత్తు కుదిరితే తనకు అవకాశం కల్పించే విషయాన్ని పరిశీలించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కోరినట్లు పేర్కొన్నారు.

బీసీలంతా టీడీపీ వైపే : టీడీపీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 27: నియోజకవర్గంలలోని బీసీలంతా టీడీపీ నేత బీవీ జయనాగేశ్వరరెడ్డి వైపు ఉన్నారని, ఆయన విజయానికి అందరూ ఐక్యంగా కృషి చేస్తారని హెచ్ కైరవాడి గ్రామ టీడీపీ నాయకులు రాజేష్, శ్రీరాములు, రామగోపాల్, అబుబక్కర్ అన్నారు. మంగళవారం బీసీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీసీ లకు ఏ సమస్య వచ్చినా బీవీ తక్షణమే స్పందిస్తారని పేర్కొన్నారు.

కబడ్డీ కోర్టు డిప్యూటీ ఈఓ పరిశీలన

ఆదోని (అగ్రికల్చర్) ఫిబ్రవరి 27: ఆదోని మండలం పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఎం శ్రీ నిధుల నుంచి నిర్మించిన కబడ్డీ కోర్టును మంగళవారం డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల నుండి ఎంతోమంది విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకుని, అదే కోటాలో ఉద్యోగాలు సాధించుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు రామన్న పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.11 కోట్లు

కౌతాళం, ఫిబ్రవరి 27: మండలంలో ప్రసిద్ద పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమీషనర్ వెంకటేష్, పాలక మండలి చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.1,11,32,643 లు, బంగారము 46 గ్రాముల 540 మిల్లి గ్రాములు, వెండి 18.9 కిలోలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని గ్రూపు టెంపుల్స్ ఈఓ రాంప్రసాద్, ఆలయ పాలక మండలి సభ్యులు విజయేంద్ర రెడ్డి, నరసింహులు, రెడ్డి గీత, లక్ష్మిరెడ్డి, నరసమ్మ, రమణి, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వాలను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలి'

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 27: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు పట్టణ అధ్యక్షుడు రంగన్న అధ్యక్షతన ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 2న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కర్నూలులో జరిగే సీపీఐ జిల్లా జనరల్‌బాడీ సమావేశానికి హాజరు కానున్నారన్నారు. జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.